

సర్దుబాటు..!

ఆయా శాఖలకు సచివాలయ ఉద్యోగులు..

- ఇప్పటికే మాతృశాఖకు పంచాయతీ కార్యదర్శులు
- వలంటీర్ల విధులు.. సచివాలయ ఉద్యోగులకు అప్పగింత
- వారి లాగిన్‌లోకి హౌస్‌హోల్డ్ మ్యాపింగ్
- గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వం పట్టం



కొత్తచెరువు మండలంలోని తలమర్ల గ్రామ సచివాలయం

ధర్మవరం, సెప్టెంబరు 27: రాజ్యాంగ వ్యవస్థలను గత వైసీపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందన్న విమర్శలు సర్వత్రా వినిపించాయి. పాలనావ్యవస్థలకు సమాంతరంగా శాఖలను సృష్టించారు. వాటి ద్వారా సాగించిన అక్రమాలు అన్నీ.. ఇన్నీ కావు. పార్టీ కలాపాలకు వ్యవస్థలను అడ్డంగా వాడుకున్నారు. ప్రజలు ఎన్నుకున్న పాలనా వ్యవస్థల అధికారాలు తొలగించి, నిర్వీర్యం చేశారు. దీనిని సరిదిద్దేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా గ్రామ పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసేదిశగా అడుగులు వేస్తోంది. గ్రామ సచివాలయ వ్యవస్థకు చెక్ పెడుతోంది. సచివాలయ ఉద్యోగులను ఆయా శాఖలకు సర్దుబాటు చేస్తామని సూచనప్రాయంగా చెప్పిన ప్రభుత్వం ఇటీవల కేబినెట్ సమావేశంలో ఓ నిర్ణయానికి వచ్చింది. ఆ వెంటనే చర్యలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో 544 వార్డు, గ్రామ సచివాలయాలున్నాయి. వీటిలో 4,517 మంది ఉద్యోగులున్నారు. వారికి గత ప్రభుత్వం నిర్దిష్టమైన జాబ్‌చార్ట్ ఇవ్వకుండా రకరకాల పనులు కేటాయించింది. సచివాలయాల ద్వారా 543 రకాల సేవలు అందిస్తామని చెప్పినా ఆచరణలో కుల, ఆదాయ సర్టిఫికెట్ల జారీ మినహా వారు అందించే సేవలు పెద్దగా ఏమీలేవు. దీంతో ఉద్యోగులంతా ఖాళీగా ఉండడమో, వారి మాతృశాఖకు సంబంధించిన విధులు చేయడమో మీసేవ కేంద్రాల్లో ఉండే డేటా ఆపరేటర్ల మాదిరిగా మారిపోవడమో జరిగింది. దీనికంతటికీ చెక్ పెట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ఈ క్రమంలో ఇప్పటికే గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులను పంచాయతీ రాజ్‌శాఖలోకి బదిలీ చేసింది. వారిని ఆయా పంచాయతీలకు కార్యదర్శులుగా నియమించింది. మిగిలిన ఉద్యోగులను కూడా ఆయా శాఖల్లో సర్దుబాటు చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సర్దుబాటుకు సంబంధించి ప్రొఫార్మా రూపొందించాలని అధికారులకు ప్రభుత్వం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. కాగా.. మహిళా పోలీసు విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. వారిని స్త్రీ, శిశుసంక్షేమశాఖ పరిధిలోకి తీసుకెళ్తారా, హోంశాఖ పరిధిలో ఉంచుతారా అన్నది తేలాల్సి ఉంది.

బాధ్యతల బదిలీ

తాజా పరిణామాల నేపథ్యంలో వలంటీర్ వ్యవస్థకు ప్రభుత్వం స్వస్తి చెప్పినట్లుగా కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే వైసీపీ ఆదేశాలతో మూడొంతుల మంది వలంటీర్లు రాజీనామా చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత గతంలో వలంటర్లు చేపట్టే పింఛన్ల పంపిణీ తదితర సంక్షేమ కార్యక్రమాలను సచివాలయ ఉద్యోగుల ద్వారా అమలు చేస్తోంది. ఆయా బాధ్యతలను పూర్తిగా సచివాలయ ఉద్యోగుల ద్వారా అమలు చేస్తోంది. సచివాలయ సిబ్బంది లాగిన్‌లో ఉన్న లబ్ధిదారుల హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌ను సచివాలయ సిబ్బంది లాగిన్‌లోకి మారుస్తున్నారు. ఒక్కో ఉద్యోగికి 100 నుంచి 150 మంది వరకు లబ్ధిదారులు ఉండేలా ఈ మ్యాపింగ్ ప్రక్రియ సాగుతోంది. ఆ మేరకు నిర్దిష్టమైన ప్రొఫార్మా గ్రామ, వార్డు సచివాలయ డైరెక్టర్ నుంచి జిల్లా అధికారులకు అందింది. ఆ ప్రొఫార్మాలో హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ పూర్తి చేశారు. ఇలా.. ఒక్కొక్కటిగా బాధ్యతలను సచివాలయ సిబ్బందికి బదిలీ చేస్తున్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో వారికి అప్పగించే అవకాశం ఉంది.

ధర్మవరం పోతాం..!

ఆ డివిజన్‌వైపే పోలీసుల చూపు.. పిల్లల చదువులు, పెద్దల అనారోగ్యం అంటూ సాకులు

అనంతపురానికి దగ్గరగా వెళ్లే ఎత్తుగడ

తలనొప్పిగా మారిన బదిలీలు

హిందూపురం, సెప్టెంబరు 27: పోలీసు శాఖలో క్రమశిక్షణ ఉంటుంది. పైఅధికారులు ఏం ఆదేశించినా తూచ తప్పకుండా నిర్వర్తించడం పోలీసుల విధి. అది ఒకప్పుడు. ఇప్పుడు వారికి నచ్చినచోట పోస్టింగ్ కోసం పైరవీలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నపుడు హిందూపురానికి పోలీసులు రావడానికి క్యూకట్టేవారు. జిల్లా విభజన అనంతరం అనంతపురం దగ్గరగా వెళ్లడానికే ఇష్టపడుతున్నారు. జిల్లాలో ఐదు పోలీసు సబ్‌డివిజన్లు ఉన్నాయి. అందులో ఎక్కువశాతం హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు ఉన్న డివిజన్ ధర్మవరమే. ఇంకా అక్కడకు వెళ్లాలని ప్రజాప్రతినిధులొచ్చి లేఖలు పట్టుకుని తిరుగుతున్నారు. హిందూపురం, మడకశిర, కదిరి ప్రాంతాలకు వెళ్లడానికి పోలీసులు ఇష్టపడట్లేదు. బదిలీల ప్రక్రియ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఇది ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారింది. ఎక్కువ మంది ధర్మవరానికే ప్రయత్నాలు చేస్తుండడంతో ఎవరికి ఇవ్వాలో.. అర్థంకాని పరిస్థితి నెలకొంది.

చదువుల సాకుతో..

చాలామంది పోలీసులు అనంతపురంలో నివాసం ఉంటున్నారు. దీంతో ఆ సమీపంలోని పోలీసు స్టేషన్‌లో పనిచేయడానికి ఎక్కువ మక్కువ చూపుతున్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర, కదిరి సబ్‌డివిజన్ల పరిధిలో పని చేయడానికి హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు ఆసక్తి చూపట్లేదు. దీంతో ఈ సబ్‌డివిజన్లలోని పోలీసులు ధర్మవరం డివిజన్‌వైపు చూస్తున్నారు. ప్రజాప్రతినిధులవద్దకెళ్లి పిల్లల చదువులు, తల్లిదండ్రులు, అత్తమామల అనారోగ్య సమస్యలు అని చెప్పి లేఖలు పట్టుకుని, పైరవీలకు తెరలేపారు. ధర్మవరం సబ్‌డివిజన్‌లో ఇప్పటికే అన్ని పోలీసు స్టేషన్లలో మిగిలిన చోటకంటే ఎక్కువమంది సిబ్బంది ఉన్నారు. అయినా అక్కడికే వెళ్లడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అక్కడి నుంచి వచ్చేవారు ఒక్కరుకూడా లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో బదిలీల ప్రక్రియ ఎలా సాగుతుందోనని ఉన్నతాధికారులు తలలు బాదుకుంటున్నారు.

జిల్లాలో సిబ్బంది సంఖ్య ఇలా..

పుట్టపర్తి పోలీసు సబ్‌డివిజన్‌లో 42 మంది హెడ్‌కానిస్టేబుల్ పోస్టులుండగా.. ఎక్కడా ఖాళీ లేవు. 143 కానిస్టేబుల్ పోస్టులుండగా ప్రస్తుతం 99 మంది ఉన్నారు. ధర్మవరం సబ్‌డివిజన్ పరిధిలో 52 మంది హెడ్‌కానిస్టేబుళ్లకుగాను 48మంది ఉన్నారు. 211 పోలీసులకుగాను 144 మంది స్టేషన్‌లో ఉండగా.. మరికొంతమంది వేరే విభాగాల్లో ఉన్నారు. హిందూపురం సబ్‌డివిజన్‌లో 42 మంది హెడ్‌కానిస్టేబుళ్లకుగాను 37మంది ఉన్నారు. 143మంది కానిస్టేబుళ్లకుగాను 93మంది ఉన్నారు. ఇందులో ఐదుగురు హెడ్‌కానిస్టేబుళ్లు వేరే ప్రాంతంలో అటాచ్‌గా ఉన్నారు. పలువురు కానిస్టేబుళ్లదీ అదే పరిస్థితి. పెనుకొండ సబ్‌డివిజన్‌లో హెడ్‌కానిస్టేబుళ్లు 58 మందికిగాను 49మంది, 190మంది కానిస్టేబుళ్లకుగాను 137మంది ఉన్నారు. కదిరి సబ్‌డివిజన్‌లో 40మంది హెడ్‌కానిస్టేబుళ్లకుగాను 39 మంది, 136 మంది కానిస్టేబుళ్లకుగాను 84మంది ఉన్నారు. దీనిని బట్టి అత్యధికంగా ధర్మవరం సబ్‌డివిజన్‌లో ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి.

తలనొప్పిగా మారిన బదిలీలు

కూటమి ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు దాటిన నేపథ్యంలో గత ఐదేళ్ల వైసీపీ పాలనలో కొంత మంది పోలీసులు అత్యుత్సాహపడి వైసీపీకి వీరబంట్లలా పనిచేశారు. తెలుగుదేశం నాయకులను నానా ఇబ్బందులు పెట్టారు. అలాంటివారు ఇప్పటికి ఆయా స్టేషన్లలో చలామణీ అవుతుండటంతో కూటమి నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితుల్లో అలాంటి వారిని గుర్తించి వేరే ప్రాంతాలకు బదిలీ చేయాలని ఎమ్మెల్యేల ద్వారా స్థానిక నాయకులు ఒత్తిళ్లు తెస్తున్నారు. ఆ మేరకు వైసీపీకి వీరవిధేయులుగా పనిచేసిన జాబితాను జిల్లా ఉన్నతాధికారులకు పంపారు. ధర్మవరం మినహా అన్ని సబ్‌డివిజన్లలో ఇచ్చిన లిస్టులతో బయటకు పంపితే.. ఆయా స్టేషన్లకు వచ్చే సిబ్బంది లేక ఉన్నతాధికారులు తలలు బాదుకుంటున్నారు.



మండల స్టేషన్లకే మొగ్గు

పోలీసులు పట్టణాల్లో పనిచేయడానికి ఇష్టపడట్లేదు. పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉండటంతో పగలు, రాత్రి కూడా విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. దీంతో కొంతమంది పోలీసులు పట్టణాల్లో స్టేషన్లు తమకొద్దు అంటూ మండలాలకు వెళ్లడానికి ఇష్టపడుతున్నారు. హిందూపురం, కదిరితోపాటు మరికొన్ని పట్టణాల్లో పనిచేయడానికి ఇష్టపడటంలేదు. మండల స్టేషన్‌లో అయితే విధుల్లో ఇబ్బంది ఉండదని అటువైపుగా పోలీసులు ఆలోచిస్తున్నారు. ఆదాయ మార్గాలున్న స్టేషన్లకైతే పోలీసులు క్యూకడుతున్నారు. జాతీయ రహదారికి అనుబంధంగా ఉండే స్టేషన్లకు భలేగిరాకీ ఉంది.

జేఆర్ శిల్క్స్‌పై చర్యలు తీసుకోండి

ముఖ్యమంత్రికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ



ధర్మవరం, సెప్టెంబరు 27: చేనేత చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్మికుల పొట్టకొడుతున్న జేఆర్ శిల్క్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు లేఖ రాశారు. ఆ లేఖను సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునుగు మధు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. బత్తలపల్లి మండలం వేల్పుమడుగు గ్రామ సమీపాన జేఆర్ శిల్క్స్ ఫ్యాక్టరీలో జెట్ లూమ్స్ ఏర్పాటుచేసి, వాటిపై నిబంధనలకు విరుద్ధంగా ప్యూర్ టు ప్యూర్ చీరలు తయారు చేస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. దీంతో చేనేత చీరలకు గిట్టుబాటు ధరలేక నేతన్నలు నష్టపోతున్నారన్నారు. విచారణ నిమిత్తం వెళ్లిన అధికారులు కూడా ముడుపులు తీసుకుని, ఫ్యాక్టరీకి క్లీన్‌చిట్ ఇస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ధర్మవరంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాన్ని ఏర్పాటుచేయాలని లేఖలో కోరారు. జిల్లాకు చెందిన రాష్ట్ర చేనేత జౌళిశాఖ మంత్రి సవిత, వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు కూడా లేఖ పంపారు.

ప్రకృతి వ్యవసాయం.. లాభదాయకం

జిల్లా వ్యవసాయ శాఖాధికారి

మడకశిర రూరల్/రొళ్ల, సెప్టెంబరు 27: ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వైవీ సుబ్బారావు తెలిపారు. మడకశిర, రొళ్ల మండలాల్లో పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. మడకశిర మండలంల జిల్లేడగుంట గ్రామ రైతు విశ్వనాథ్ ప్రకృతి వ్యసాయ పద్ధతిలో సాగుచేసిన పత్తి పంటను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలను సాగు చేయడం ద్వారా మిత్రపురుగులు అభివృద్ధి చెందుతాయన్నారు. తద్వారా పురుగు మందు ఖర్చులు తగ్గించుకోవచ్చన్నారు. ఘన, ద్రవ జీవామృతాల వినియోగం ద్వారా భూసారం పెరిగి, దిగుబడులు బాగా వస్తాయన్నారు. అలాగే ఈకేవైసీ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ కృష్ణమీనన్, ఏఓలు తిమ్మప్ప, ఆదిలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



పత్తి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖాధికారి

పలువురు ఎస్‌ఐల బదిలీ

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 27: జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీచేస్తూ ఎస్పీ రత్న శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లా వీఆర్‌లో ఉన్న ఆరుగురికి పలు స్టేషన్లకు పోస్టింగ్ ఇచ్చారు. సత్యానారాయణను చెన్నేకొత్తపల్లికి, మక్బూల్‌బాషాను నల్లచెరువుకు, జీ నరేంద్రప్రసాద్‌ను సైబర్‌సెల్‌కు, ఎస్ నరేంద్రను లేపాక్షికి, జీ రామచంద్రయ్యను పుట్టపర్తి అర్బన్‌కు, కే నరేంద్రను రొద్దం పోలీసుస్టేషన్‌కు బదిలీ చేశారు. రొద్దం ఎస్‌ఐ వలీబాషాను నంబులపూలకుంటకు పంపారు. కాగా, అంతకుముందు ముగ్గురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ అనంతపురం డీఐజీ షిమోసి ఉత్తర్వులు జారీ చేశారు. బత్తలపల్లి ఎస్‌ఐ పి శ్రీనివాసులును ధర్మవరం రూరల్‌కు, అక్కడ పనిచేస్తున్న కె. నరేంద్రను శ్రీసత్యసాయి జిల్లా వీఆర్‌కు పంపారు. అనంతపురం ఇంటెలిజెన్స్ ఎస్‌ఐగా పనిచేస్తున్న సోమశేఖర్‌ను బత్తలపల్లి పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. ధర్మవరం రూరల్ ఎస్‌ఐ కె. నరేంద్రను డీఐజీ వీఆర్‌కు పంపగా.. ఆ వెంటనే రొద్దంకి బదిలీ చేయడం గమనార్హం.

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేద్దాం

- కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపు
- ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



తోలుబొమ్మలాట



హాజరైనవారు





నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, సెప్టెంబరు 27: జిల్లాను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేసి, ప్రథమస్థానంలో నిలిపేందుకు కృషి చేద్దామని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. స్థానిక సాయిఆరామంలో జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ జ్యోతి వెలిగించి, కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సత్యసాయి అవతరించిన పుట్టపర్తి ఆధ్యాత్మిక, పర్యాటకంగా ప్రపంచ గుర్తింపు పొందిందన్నారు. రాయల రెండో రాజధానికి వెలుగొందిన పెనుకొండ, శిల్పకళల నిలయం లేపాక్షి, వేమన సమాధి, తిమ్మమ్మ మర్రిమాను, పెనుకొండ కుంభకర్ణ ప్రాజెక్టు, కదిరి లక్ష్మీనరసింహస్వామి, హేమావతి సిద్దేశ్వరాలయాలు, వీరాపురం విదేశీ పక్షుల విడిది కేంద్రం, నిమ్మలకుంట తోలుబొమ్మల పరిశ్రమ, ధర్మవరం చేనేత పరిశ్రమ ప్రపంచ ప్రసిద్ధికెక్కాయన్నారు. వీటన్నింటినీ అనుసంధానిస్తూ టూరిజం సర్క్యూట్ ఏర్పాటు అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి స్వచ్ఛంద సంస్థలు, ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నిమ్మలకుంట తోలుబొమ్మల ప్రదర్శన అకట్టుకుంది. రామాయణాన్ని కన్నులకు కట్టారు. అనంతరం కళాకారులకు జిల్లా కలెక్టర్ బహుమతులను అందజేసి, అభినందించారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, జిల్లా పర్యాటక అధికారి జయకుమార్ బాబు, మేనేజర్ ప్రతాపరెడ్డి, శిల్పారామం మేనేజర్ రమేష్‌రెడ్డి, జిల్లా అటవీశాఖాధికారి చక్రధర్ పాల్గొన్నారు.

సెలవుపై వైద్యుడు

ఉన్నతాధికారి ఒత్తిడే కారణమని చర్చ

పురం ఆస్పత్రిలో సేవలపై ప్రభావం



హిందూపురం మాతాశిశు ఆస్పత్రి

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 27: స్థానిక జిల్లా ఆస్పత్రిలో రోజుకో పరిణామం తలెత్తుతోంది. ఆస్పత్రిలో ఇద్దరు గర్భస్థ శిశువుల మృతిపై గురువారం విచారణ ముగిసింది. మరుసటిరోజే శుక్రవారమే ఆస్పత్రిలో గైనిక్ సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ బాబాబుడేన్ సెలవులో వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది. ఎప్పటి వరకు సెలవులో వెళ్తున్నారని తోటి ఉద్యోగులు అడగ్గా.. ఆస్పత్రి బాగుపడేవరకు అని ఆయన సమాధానం చెప్పినట్లు ఆస్పత్రిలో చర్చ సాగుతోంది. ఆస్పత్రి ఉన్నతాధికారి వేధింపులు భరించలేకే వైద్యుడు సెలవులో వెళ్తున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. రోజూ సూటిపోటి మాటలతో వేధిస్తున్నట్లు చర్చ సాగుతోంది. సీనియర్ వైద్యుడు సెలవుపై వెళ్లడం ఆస్పత్రిలో సేవలపై ప్రభావం చూపనుంది. ఆస్పత్రికి రోజూ వంద మందిదాకా గర్భిణులు, బాలింతలు వస్తుంటారు. 80 మంది వరకు ఇన్‌పేషెంట్లు ఉంటారు. ఇప్పటికే వైద్యుల కొరతతో ఇబ్బంది పడుతున్నారు. దీంతో రోజూ దాదాపు 10 వరకు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి రెఫర్ చేస్తున్నట్లు సమాచారం. ఆస్పత్రిలో నలుగురు గైనకాలజిస్టులు ఉన్నారు. వీరిలో ఒక వైద్యురాలు ఇప్పటికే మెటర్నిటీ సెలవులో వెళ్లారు. మిగిలింది ముగ్గురు. వారిలో కూడా డాక్టర్ బాబాబుడేన్ తాజాగా సెలవుపై వెళ్లారు. ఇక ఇద్దరే ఉంటారు. వీరిలో ఎవరైనా సెలవు పెడితే గర్భిణులు, బాలింతల పరిస్థితి ఏమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వచ్చిన వారందరినీ రెఫర్ చేయాల్సిందేనన్న చర్చలు సాగుతున్నాయి.

ఖర్చు పెట్టుకోండి.. ఛైర్మన్ అయిపోండి..

వైసీపీ కౌన్సిలర్లకు అధినేత ఉచిత సలహా.. బలం లేకుండా పోటీ ఎలా?

హిందూపురం, సెప్టెంబరు 27: స్థానిక మున్సిపల్ ఛైర్మన్ సీటు కావాలని వెళ్లిన వైసీపీ కౌన్సిలర్లకు ఆ పార్టీ అధినేత ఓ ఉచిత సలహా ఇచ్చి పంపారు. ఖర్చుపెట్టుకునే వారు ఉంటే ముందుకెళ్లాలని చెప్పారట. హిందూపురం మున్సిపాలిటీలోని పలువురు వైసీపీ కౌన్సిలర్లు శుక్రవారం జగన్‌ను తాడేపల్లిగూడెంలో కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్మన్ స్థానం కోసం పోటీలో ఉంటామని అధినేతను పలువురు కోరినట్లు తెలిసింది. ఖర్చుపెట్టుకునేవారు ఉంటే ముందుకెళ్లాలని ఆయన సలహా ఇచ్చినట్లు సమాచారం. మున్సిపాలిటీలో మొత్తం 38 మంది వార్డులున్నాయి. మూడేళ్ల క్రితం ఎన్నికల్లో 30 మంది వైసీపీవారే గెలుపొందారు. అప్పట్లో 19వ వార్డు నుంచి గెలుపొందిన ఇంద్రజను ఛైర్‌పర్సన్‌గా ఎన్నుకున్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక నెలక్రితం ఆమె ఛైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆమెతోపాటు ఎనిమిది మంది కౌన్సిలర్లు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్నికలకు ముందే వైసీపీకి చెందిన కౌన్సిలర్లు.. టీడీపీలో చేరారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీకి 19 మంది సభ్యుల బలం ఉంది. మరో ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు తటస్థంగా ఉంటూ టీడీపీకి మద్దతు తెలుపుతామని హామీ ఇచ్చినట్లు తెలిసింది. ఎమ్మెల్యే, ఎంపీ ఓట్లు కూడా టీడీపీకే ఉండటంతో మొత్తం బలం 22-23కి చేరుతుంది. వైసీపీకి 17-18 సభ్యులు మాత్రమే ఉంటారు. అలాంటపుడు ఛైర్మన్ స్థానానికి వైసీపీ పోటీపడాలనుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. అయినా వైసీపీలోని ఓ కీలకనేత తన మాట జగన్ వద్ద నెగ్గించుకునేందుకు హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ పదవిని తెరపైకి తెచ్చినట్లు తెలిసింది. తాడేపల్లికి 12 మందిదాకా కౌన్సిలర్లు వెళ్లినట్లు సమాచారం. ఇద్దరు వైస్ ఛైర్మన్లతోపాటు పదిమంది కౌన్సిలర్లు ఉన్నట్లు తెలిసింది. జగన్ వద్ద ఛైర్మన్ కావాలని నలుగురు అడిగారు. వారిలో ఇద్దరు ఎన్నికల సమయంలో ఖర్చుపెట్టుకున్నామనీ, పార్టీనే సాయం చేసి, ఛైర్మన్‌గా ఎంపిక చేస్తే అభ్యంతరం లేదనీ, తమనే ఖర్చుపెట్టుకొమ్మంటే మాత్రం వద్దని చెప్పినట్లు విశ్వసనీయ సమాచారం. మరో ఇద్దరు సభ్యులు మాత్రం తాము ఖర్చుపెట్టుకుంటామనీ, ఛైర్మన్ స్థానం దక్కేలా చూడాలని జగన్ వద్ద కోరినట్లు తెలిసింది. ఐదుగురు సభ్యుల వ్యత్యాసం ఉండికూడా ఛైర్మన్ కావాలని వైసీపీ కౌన్సిలర్లు కోరడం విడ్డూరంగా ఉందని ఆ పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు. ఏది ఏమైనా బలం లేకుండానే ఛైర్మన్ ఎంపిక అంటూ వైసీపీ నేత.. కౌన్సిలర్లను జగన్ వద్దకు తీసుకెళ్లడం వెనుక ఆంతర్యం ఏమిటో ఆ పార్టీ నాయకులకే ఎరుక అంటూ కూటమి నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. జగన్ ఉచిత సలహా ఇచ్చి పంపడం పట్ల కొంతమంది కౌన్సిలర్లు నిట్టూర్చారు.



మళ్లీ అలవెన్స్ వచ్చేనా?

ఆర్టీసీలో నైట్ అవుట్ అలవెన్సులకు మంగళం

● వందల మందికి బకాయి
● పునరుద్ధరణ కోసం ఉద్యోగుల ఎదురుచూపు

డ్యూటీ బేస్డ్ అలవెన్సులను అందించాలి

నైట్ అవుట్ అలవెన్సులు డ్యూటీ బేస్డ్ అలవెన్సుల కిందకు వస్తాయి. అయితే ఉన్నతాధికారులు డీఏ కింద పరిగణించి ఇవ్వడం లేదు. ఐఓ 114 మేరకు ఇవి డ్యూటీ బేస్డ్ అలవెన్సుల కిందకే వస్తాయి కాబట్టి బకాయి పడ్డ అలవెన్సు సొమ్మును వెంటనే ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయాలి.

- సూరిబాబు, జిల్లా చైర్మన్, ఎన్ఎంయూఏ



అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 27: నైట్ అలవెన్స్‌ల పునరుద్ధరణ కోసం ఆర్టీసీ ఉద్యోగులు ఎదురు చూస్తున్నారు. వారికి ఇస్తున్న నైట్ అలవెన్స్‌కు గత వైసీపీ ప్రభుత్వం మంగళం పాడిన విషయం తెలిసిందే. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని ఓ వైపు గొప్పగా ప్రకటించుకుని, మరోవైపు కార్మికుల ప్రయోజనాలకు కోత విధించింది. నైట్ అవుట్ అలవెన్సులను నిలిపివేతపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఆందోళనలు చేపట్టడంతో అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు మూడు నెలల ముందు అలవెన్సులను అందించింది. ఎన్నికలు ముగిసి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆర్టీసీ ఉన్నతాధికారులు మరోసారి నైట్ అవుట్ అలవెన్సులను నిబంధనల సాకుతో నిలిపివేశారు. దీంతో గత రెండు నెలలుగా ఉద్యోగులకు అలవెన్సులు బకాయి పడ్డారు. సొంత డిపో నుండి ఇతర డిపోలకు వెళ్లి అక్కడే నైట్ అవుట్(రాత్రి బస) చేస్తే అందుకుగాను 9 గంటల లోపు అయితే రూ.150లు, 9 గంటలపైగా అయితే రూ.350లు చొప్పున అందించాల్సి ఉన్నప్పటికీ అందించలేదు. నెలలో ఒక్కో డ్రైవర్ లేదా కండక్టర్‌కు దాదాపు 12 నైట్ అవుట్‌లు పడుతాయి. ఈ లెక్కన ఒక్కో ఉద్యోగి రూ.4200 నష్టపోవాల్సి వస్తోంది. రీజియన్ వ్యాప్తంగా 512 బస్సులుండగా షెడ్యూల్‌లో వెళ్తున్నవి 461 సర్వీసులు ఉన్నాయి. వీటిలో దాదాపు 120 సర్వీసులు నైట్ అవుట్‌లకు వెళ్తున్నాయి. ఒక్కో సర్వీసులో డ్రైవర్, కండక్టరు ఉంటారు. ఈలెక్కన దాదాపు 240 మంది ఉద్యోగులకు నైట్ అవుట్ అలవెన్సులను అధికారులు ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ఉద్యోగులు మరోసారి ఆందోళన చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు.



అలవెన్సులు ఇవ్వాలంటూ అనంతపురం డిపో వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు (ఫైల్)

అలవెన్సులు ఆపివేయడం బాధాకరం

ఆర్టీసీలో ముందు నుంచే నైట్ అవుట్‌లకు అలవెన్సులు ఇచ్చే సంప్రదాయం ఉంది. పీఆర్సీ ఇచ్చినప్పుడల్లా కొంత మొత్తంలో అలవెన్సు పెంచేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాక కొంతకాలం ఆపేసారు. తర్వాత కార్మికుల ఆందోళనతో పునరుద్ధరించారు. ఇపుడు మళ్లీ ఈ ఏడాది జూలై నెల నుంచి ఆపేశారు. యూనియన్ తరఫున అధికారులకు పలు దఫాలు వినతిపత్రాలు ఇచ్చాము. ప్రభుత్వంతో చర్చించి అమలుకు చర్యలు చేపడతామంటున్నారు. అయినా ముందు నుంచి అమలు చేస్తూ వస్తున్న అలవెన్సులను ఆపివేయడం బాధాకరం.

- పీఎస్ ఖాన్, ఎంప్లాయీస్ యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి



చిన్నారిపై కుక్కల దాడి



గాయపడిన చిన్నారి

గుత్తి, సెప్టెంబరు 27: కుక్కలు దాడి చేయడంతో గుత్తి ఆర్ఎస్ రామాలయం వీధిలో రోషిణి అనే చిన్నారి శుక్రవారం తీవ్రంగా గాయపడింది. గుత్తి ఆర్ఎస్‌లో వంగగడ్డ వీధిలో నివాసముంటున్న రైల్వే ఉద్యోగి ప్రసాద్, భారతి దంపతుల కుమార్తె రోషిణిని స్థానిక రామాలయం వీధిలో ట్యూషన్‌కు పంపించారు. మూత్ర విసర్జన కోసం ట్యూషన్ బయటకు వచ్చిన ఆచిన్నారిపై కుక్కలు దాడి చేసి కాళ్లు, చేతులను కరిచాయి. గమనించిన స్థానికులు గట్టిగా కేకలు వేసి కుక్కలను తరిమివేశారు. గాయపడిన బాలికను స్థానిక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మున్సిపల్ అధికారులు కుక్కల బెడదను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా సురేష్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 27: జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా గుంటూరు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈగా పని చేస్తున్న సురేష్‌ని నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు ఎస్ఈగా ఉన్న ఎహసాన్‌బాషాను శ్రీకాకుళం ఎస్ఈగా బదిలీ చేశారు. ఈఈ జవహర్‌ను పాడేరు ఈఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో పొదిలీ ఈఈగా ఉన్న మురళీధర్‌రావును నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పుట్లూరుకు బదిలీ అయిన క్వాలిటీ కంట్రోల్ ఏఈ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం రిలీవ్ అయ్యారు.

శాశ్వత లోక్ అదాలత్‌లో ఉచిత న్యాయసేవలు

ఉమ్మడి జిల్లాల శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాసరావు

అనంతపురం క్రైం, సెప్టెంబరు 27: శాశ్వత లోక్ అదాలత్‌లో ఉచిత న్యాయసేవలు వినియోగించుకోవాలని ఉమ్మడి జిల్లాల శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్, జిల్లా న్యాయాధికారి శ్రీనివాసరావు ప్రజలకు సూచించారు. న్యాయసేవాసదన్‌లో శుక్రవారం ప్రభుత్వ అధికారులకు శాశ్వత లోక్‌అదాలత్‌లో ప్రజాప్రయోజన కేసుల పరిష్కారంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సహజ న్యాయ సూత్రాల ఆధారంగానే శాశ్వత లోక్ అదాలత్‌లో వివాద పరిష్కారం జరుగు తుందన్నారు. రవాణా సేవలు, పోస్టల్, టెలిఫోన్ సేవలు, విద్యుత్తు, నీటి సరఫరా, శానిటేషన్, ఆసుపత్రుల్లో సేవలు, బీమా సేవలు, హౌసింగ్, రియల్ ఎస్టేట్ తదితర సేవలు ఇరుపక్షాల నడుమ సామరస్య పరిష్కారానికి అవకాశం కల్పిస్తుందన్నారు. రాజీ కుదరని పక్షంలో రూ.కోటి పరిహారం వరకు వివాదాల పరిష్కారానికి తీర్పు వెలువరించగల అధికారం లోక్ అదాలత్ కలిగి ఉందన్నారు. ఫిర్యాదు దాఖలు చేయడానికి ఎలాంటి కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

ముస్లింలకు కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం



కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న షఫీవుల్లా

అనంతపురం కల్చరల్, సెప్టెంబరు 27: ముస్లిం సామాజికవర్గ కుటుంబ సమస్యల పరిష్కారం కోసం స్థానిక జామియా మసీదులో ముస్లిం కమ్యూనిటీ ఉచిత కౌన్సెలింగ్ సెంటర్‌ను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమానికి రాష్ట్ర వక్ఫ్‌బోర్డు మాజీ సభ్యుడు, జామియా మసీదు ముతవల్లి కేఎం షఫీవుల్లా ముఖ్యఅతిథిగా హాజరై ఉచిత కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా షఫీవుల్లా మాట్లాడుతూ ముస్లిం సామాజిక వర్గానికి చెందిన కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు న్యాయవాదులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, ఇమాములు, ఖాజీలతో కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీవారిచే బాధిత కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు, ప్రతి ఆదివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ సెంటర్ పనిచేస్తుందన్నారు. కౌన్సెలింగ్ అవసరమైనవారు 9059994030 లేదా 98491 98783 నంబర్లను సంప్రదించవచ్చునన్నారు. ముతవల్లీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేఎం షకీల్ షఫీ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జనబలం బాబా, బాబా తాజుద్దీన్, జామియా మసీదు పేషమాం రబ్బానీ, మేనేజర్ అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేద్దాం

● పలువురు వక్తలు
● శిల్పారామంలో పర్యాటక దినోత్సవం

అనంతపురంరూరల్, సెప్టెంబరు 27: పర్యాటకంగా జిల్లాను అభివృద్ధి దిశలో నడిపేందుకు కృషి చేద్దామని వక్తలు పిలుపునిచ్చారు. మండలంలోని శిల్పారామంలో శుక్రవారం పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పామిడి అనంత గజగరుడ లక్ష్మీనారాయణ దేవాలయం ఉందని, ఆ దేవాలయంలో విశేష శిల్పకళ ఉందన్నారు. కానీ జిల్లా వాళ్లకే ఆ విశిష్టత గురించి తెలియదని, ఇలాంటి దేవాలయాలను పర్యాటక స్థలంగా తెలియజేయడానికి అవకాశం ఉందన్నారు. పెన్నఅహోబిలం, నెట్టికంటి ఆంజనేయస్వామి ప్రాంతాలకు ప్రజలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు నిర్వహించే ప్రాంతంలో బస్సుషెల్టర్ల ఏర్పాటు ఎంపీ నిధుల నుండి కేటాయించే విధంగా నివేదికలు తయారు చేసి పంపాలన్నారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో హరిత హోటల్స్, టూరిజం రెస్టారెంట్స్ దీనస్థితికి చేరాయని ప్రస్తుత ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్దపీట వేసి ముందుకు తీసుకువెళ్లే దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో అద్భుతంగా ఉన్న నేషనల్ పార్కును వైసీపీ పాలకులు భ్రష్టు పట్టించారన్నారు. పార్కు అభివృద్ధి కోసం రూ.10 కోట్లు కేటాయించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. చెరువుకట్టను ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. కలెక్టర్ దృష్టికి అన్ని అంశాలు తీసుకెళ్లామని త్వరలోనే ఇందుకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. అనంతరం జిల్లా టూరిజం శాఖ వారి హెరిటేజ్ టూరిజం సర్క్యూట్, ప్రపంచ పర్యాటక దినోత్సవం 2024 పోస్టర్లను విడుదల చేశారు. పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వక్తృత్వ పోటీలు, క్విజ్ పోటీలు, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీపీఈఓ వెంకటరమణ నాయక్, జిల్లా టూరిజం అధికారి జయకుమార్‌బాబు, తహసీల్దార్ హరిప్రసాద్, శిల్పారామం ఏఓ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు



నృత్యం చేస్తున్న కళాకారులు

మాకూ వాటా ఇవ్వాల్సిందే..!

● బెల్టుషాపు నిర్వహించాలంటే కప్పం కట్టాల్సిందే
● విక్రేత అరెస్ట్‌తో వసూళ్ల పర్వం వెలుగులోకి..

యాడికి, సెప్టెంబరు 27: మండలకేంద్రంలో బెల్ట్‌షాపులు నిర్వహించాలంటే తమకు కప్పం కట్టాల్సిందేనని కొందరు అధికారపార్టీ వర్గీయులు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు దుమారం రేగింది. యాడికిలోని కుంటలో ఒక వ్యక్తి బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఉదయం 5గంటల నుంచి మద్యంషాపులు తెరిచే వరకు, రాత్రి మద్యం షాపులు మూసివేసిన తర్వాత అక్రమంగా మద్యం విక్రయిస్తూ కొత్త వ్యాపారానికి తెరలేపాడు. మద్యం బాటిళ్లను అధిక ధరలకు విక్రయిస్తూ లక్షలు సంపాదిస్తున్నాడు. దీనిపై కన్నేసిన అధికారపార్టీకి చెందిన ఇద్దరు వ్యక్తులు మాకు కప్పం కట్టాల్సిందే లేకపోతే మద్యం అమ్మడానికి వీల్లేదని బెదిరించినట్లు సమాచారం. దీంతో అక్రమ మద్యం విక్రేత సదరు వ్యక్తులతో బేరసారాలు ఆడి ఒక్కొక్కరికి రూ.30వేలు ప్రకారం రూ.60వేలు చెల్లించాడు. అయితే రెండురోజుల క్రితం మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యం బాటిళ్లు సీజ్‌చేశారు. ఇంత డబ్బులు కప్పం కట్టాను. పోలీసులు దాడిచేయకుండా మీరు చూసుకోవాలి కదా! మీరేం పట్టించుకోకపోతే మీకెందుకు డబ్బులు కట్టినట్లు మీ బండారం బయటపెడతానని హెచ్చరించినట్లు సమాచారం. మీతో ఫోన్‌లో మాట్లాడిన మాటల రికార్డింగ్‌లు అన్ని ఉన్నాయని చెప్పడంతో డబ్బులు తీసుకున్న వ్యక్తులు బెంబేలెత్తిపోతున్నారు. మద్యం విక్రేతను పోలీసులు అరెస్ట్ చేసిన సమయంలో ఫోన్ సీజ్‌చేశారని, ఇప్పుడు ఎలాగైనా ఆ ఫోన్‌ను ఫార్మేట్‌చేసి అతడికి ఇచ్చేలా పోలీసులతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మద్యం అక్రమ విక్రేతకు, కప్పం కట్టించుకున్న వ్యక్తులకు మధ్యవర్తిగా ఒక వ్యక్తిని పెట్టుకుని ఫోన్ రికార్డింగ్స్ అన్ని డిలీట్ చేసేలా చూస్తున్నారని సమాచారం.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 27: మహిళ లు, చిన్నారులపై లైంగిక దాడులను నియంత్రించా లంటే ప్రతి ఒక్కరికీ మహిళా రక్షణ చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా ఎస్పీ జగదీష్ అన్నా రు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు సీఐలు, ఎస్ఐలు సిబ్బందితో కలిసి మహిళా చట్టాలు, చిన్నారుల రక్షణ చట్టాలు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని కార్యక్రమాలను ఎస్పీ పర్యవేక్షించారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

అనంతపురం క్రైం, సెప్టెంబరు 27: నాలుగో అంతస్తు నుంచి పడి ఓ భవన నిర్మాణ కార్మికుడు శుక్రవారం మృతి చెందాడు. కర్నూలు జిల్లా కోసిగి మండల కేంద్రానికి చెందిన ఆంజనేయులు(38) కొంతకాలంగా జేఎన్‌టీయూ సమీపంలో నివాసముంటున్నాడు. శుక్రవారం జేఎన్‌టీయూ ఎదురుగా నిర్మిస్తున్న ఓ భవనంలో నాలుగో అంతస్తు నుంచి ఐదో అంతస్తుకు సెంట్రింగ్ సామాను సారవ కట్టెలపై నిల్చుని అందిస్తున్నాడు. ప్రమాదశాత్తు స్లిప్ కావడంతో పై నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టమోటా కిలో రూ.46



అనంతపురంరూరల్, సెప్టెంబరు 27: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు శుక్రవారం 1500 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.38, కనిష్ఠ ధర రూ.30 పలికినట్లు ఆయన తెలిపారు.

'గీతం'లో విద్యార్థిని ఆత్మహత్య

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 27: రుద్రారం గీతం యూనివర్సిటీ విద్యార్థిని వర్సిటీ హాస్టల్లోనే శుక్రవారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు.. పటాన్‌చెరు పోలీసులు తెలిపిన మేరకు.. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన నాగల్లి వర్ష (19) గీతం యూనివర్సిటీ బాలికల హాస్టల్‌లో ఉంటూ బీటెక్ సీఎస్ఈ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. శుక్రవారం ఉదయం ఎనిమిది గంటలకే కాలేజీకి వచ్చిన వర్ష 10 గంటల సమయంలో తిరిగి హాస్టల్‌కు చేరుకుంది. అనంతరం మరోసారి కాలేజీకి వెళ్లి మళ్లీ హాస్టల్‌కి వచ్చింది. ఏం జరిగిందో ఏమో కానీ తన గదిలో ఫ్యానుకు బెడ్ షీట్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హాస్టల్‌కి వచ్చిన రూమ్మేట్స్ చూసి వెంటనే వర్సిటీ యాజమాన్యానికి చెప్పడంతో వారు పటాన్‌చెరు పోలీసులకు సమాచారం అందించారు. పటాన్‌చెరు సీఐ ప్రవీణ్‌రెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి పూర్తి వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆత్మహత్య చేసుకున్న వర్ష మొదటి నుంచి కొంత ముభావంగానే ఉండేదని తోటి విద్యార్థులు చెప్పారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడిపై పోక్సో కేసు

బెళుగుప్ప, సెప్టెంబరు 27: మండలంలోని బెళుగుప్ప తండాకు చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు ఎస్ఐ శివ శుక్రవారం తెలిపారు. ప్రేమ పేరుతో బాలికను వేధిస్తుండటంతో పూర్తిస్థాయిలో విచారణ చేసి కేసు నమోదు శామన్నారు. నిందితున్ని కోర్టులో హాజరుపరచగా రిమాండు విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ ఉన్నత విద్యాసంస్థగా జేఎన్‌టీయూ

- వీసీ ప్రొఫెసర్ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 27: జాతీయ స్థాయిలో ఇంజనీరింగ్ కోర్సుల విభాగంలో జేఎన్‌టీయూ ఉత్తమ ఉన్నత విద్యాసంస్థగా వెలుగొందుతోందని, ఇందుకు మేకింగ్ ఇండియా ఎంప్లాయిబుల్ ఫోరం అందజేసిన అవార్డే ప్రతీక అని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఉన్నత విద్య, ఛేంజ్ మేకర్, విద్యార్థి, పరిశ్రమలు, లైఫ్‌టైం అచీవ్‌మెంట్ తదితర అంశాల్లో ఉత్తమ ప్రతిభను కనబర్చిన విశ్వవిద్యాలయా లకు ఇండియా ఎడ్యుకేషన్, ఎంప్లాయిబుల్, డిజిటల్ యూనివర్సిటీ, టెక్‌లీజ్ సంస్థల సంయుక్త ఫోరం అవార్డులను ప్రదానం చేసినట్లు తెలిపారు. వీటిలో జేఎన్‌టీయూకి ఎక్స్‌లెన్స్ ఇన్ హైయ్యర్ ఎడ్యుకేషన్ జాతీయ అవార్డు లభించినట్లు వెల్లడించారు. ఈ నెల 25న ముంబైలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ సత్యనారాయణ జేఎన్‌టీయూ తరఫున అవార్డు స్వీకరించారన్నారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ టూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య, డైరెక్టర్లు వైశాలి గోర్పాడే, ప్రశాంతి, సుజాత, విశాలి, పద్మసువర్ణ, ఈశ్వర్‌రెడ్డి, సురేష్‌బాబు, భానుమూర్తి, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.



వీసీ సుదర్శనరావుకు అవార్డును అందజేస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ నియామకాల్లో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి తెలిపారు. జాతీయ స్థాయిలో సెమీకండక్టర్, సిస్టం డిజైన్ సేవలందించే ఎంఓఎస్ చిప్ సంస్థలో పనిచేసేందుకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ కనబర్చిన ఈసీఈ, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు రూ.6లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు.

సీమ బీసీ విద్యార్థులంటే ముఖ్యమంత్రికి ప్రేమ

మంత్రి సవిత



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 27: రాయలసీమ బీసీ విద్యార్థులంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎనలేని ప్రేమ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. తన స్వగృహంలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో గత టీడీపీ పాలనలో పేద విద్యార్థుల కోసం చేపట్టిన ఎంజేపీ పాఠశాలల పునర్నిర్మాణం కోసం ముఖ్యమంత్రి రూ.77.64కోట్లు మంజూరు చేశారన్నారు. ఉమ్మడి జిల్లాలో 2014-19 మధ్య కాలంలో నాలుగు ఎంజేపీ పాఠశాలల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. అయితే తదనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటిని నిలిపివేసిందన్నారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించి నిధులు విడుదల చేశారన్నారు. గతంలో మంజూరైన రొద్దం మండలంలోని ఎంజేపీ పాఠశాల నూతన భవనానికి ఈ నిధుల్లోనే రూ.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. పెనుకొండ మండలం, రాంపురంలో ఎంజేపీ పాఠశాల నిర్మాణానికి స్థలం సేకరిస్తున్నామని, అనువైన స్థలం దొరకగానే భవన నిర్మాణ పనులు చేపడతామని ఆమె అన్నారు. కార్యక్రమంలో మాధవనాయుడు, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, టైలర్ అంజనేయులు, కన్వీనర్ శ్రీరాములు, మావటూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్

వీసీ ప్రొఫెసర్ అనిత



ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ప్రతినిధులతో వీసీ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు

అనంతపురం సెంట్రల్, సెప్టెంబరు 27: ఎస్కేయూలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) టెక్నాలజీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. విశాఖపట్నం ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ డీజీఎం ప్రసాద్‌రెడ్డి, ఎస్కేయూ రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు శుక్రవారం వర్సిటీని సందర్శించారు. అనంతరం వీసీతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్కేయూలో అటల్ ఇంక్యుబేషన్, ఇస్రో పరిశోధన కేంద్రం, స్కిల్ డెవలప్‌మెంట్ తదితర కేంద్రాలున్నాయని తెలిపారు. వీటికి అదనంగా ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటుచేసి వేలాది మంది విద్యార్థులకు నైపుణ్య శిక్షణా తరగతులు నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ప్రతినిధులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డితో కలిసి శిక్షణ, వర్క్‌షాప్‌ల నిర్వహణకు అవసరమైన స్థలాన్ని పరిశీలించారు.

టీటీసీ పరీక్షలు వాయిదా

అనంతపురం విద్య, సెప్టెంబరు 27: టీటీసీ థియరీ లోయర్ గ్రేడ్ పరీక్షలు వాయిదా వేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చేనెల 6న పరీక్షలు జరగాల్సి ఉండగా ఏపీ టెట్ కారణంగా వచ్చేనెల 27కి వాయిదా వేసినట్లు స్పష్టం చేశారు. టీటీసీ రెగ్యులర్, ఒకసారి ఫెయిల్ అయిన అభ్యర్థుల హాల్‌టికెట్లు www.bse.ap.gov.in వెబ్‌సైట్ లో ఉంచినట్లు తెలిపారు.

బాలికపై వీఆర్ఏ అత్యాచారయత్నం

పుట్లూరు, సెప్టెంబరు 27: మండలంలోని ఓ గ్రామంలో 11ఏళ్ల బాలికపై ఓ వృద్ధ వీఆర్ఏ (గ్రామసేవకుడు) అత్యాచారానికి యత్నించినట్లు ఎస్ఐ హేమాద్రి శుక్రవారం తెలిపారు. పాఠశాల నుంచి బాలిక ఇంటికి వెళ్లే సమయంలో అదే గ్రామానికి చెందిన వీఆర్ఏ తిరుపాలు డబ్బులు ఇస్తాను అని చెప్పి బాలికను చౌడమ్మ ఆలయం నుంచి సచివాలయం వెనుకకు తీసుకువెళ్లాడన్నారు. మాయమాటలు చెప్పి లొంగతీసుకొనే ప్రయత్నం చేశాడన్నారు. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు చూసి పట్టుకొని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, స్పెషల్‌పార్టీ పోలీసులు బందోబస్తుగా ఉన్నారు.



కార్యకర్తలతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాసమస్యలను పరిష్కరిస్తాం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

ధర్మవరం, సెప్టెంబరు 27: ప్రజా సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి విద్యుత్ సబ్సిడీ, వర్క్‌షెడ్ పథకాలను అందేలా చేస్తామన్నారు. శుక్రవారం స్థానిక గాంధీనగర్ టీడీపీ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్ పాలనలో ప్రజలు సమస్యలతో విసిగిపోయారని, ప్రస్తుతం ఆ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. రైతు, ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడానికి చొరవ చూపాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చింతలపల్లి మహేశ్ చౌదరి, పరిశే సుధాకర్, పురుషోత్తం గౌడ్, బీమనేని ప్రసాద్ నాయుడు, అంబటి సనత్, మాధవరెడ్డి, బీరే శ్రీనివాసులు చట్టా లక్ష్మీనారాయణ, కేశగాళ్ల శీనా పాల్గొన్నారు.

మున్సిపల్ టీచర్ల సమస్యలను పరిష్కరించాలి

ధర్మవరం, సెప్టెంబరు 27: మున్సిపాలిటీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు వారు ఎంఈఓ-1,2 రాజేశ్వరి, గోపాల్‌నాయక్‌లకు వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్ర విభజన జరిగి దాదాపు 10 సంవత్సరాలు కావస్తున్నా మున్సిపాలిటీ టీచర్ల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. మున్సిపాలిటీ హైస్కూల్‌లో తగినంత సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. నవంబరులోగా అప్‌గ్రేడ్ పోస్టులలో మున్సిపాలిటీ టీచర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, మున్సిపల్ హెచ్ఎంల్లో అర్హులైన వారికి అర్బన్ ఎంఈఓగా నియమించాలన్నారు. మున్సిపల్ టీచర్లకు జీపీఎఫ్ ఖాతాలు తెరవాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఆడిట్ కమిటి సభ్యులు రామకృష్ణనాయక్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు హరికృష్ణ, సాయిగణేశ్, నాయకులు లక్ష్మయ్య, రాంప్రసాద్, హెచ్.రామాంజినేయులు, హరిశంకర, అంజనేయులు, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : తమ సమస్యలు పరిష్కరించాలని యుటీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎంఈఓ చెన్నక్రిష్ణకు మున్సిపల్ ఉపాధ్యాయులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వైవీ సుబ్బారెడ్డి, అజామ్‌బాషా, సునీల్‌కుమార్, అనిత, మానస, ఉషా, సుధాకర్, నాగేంద్ర, మధు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

కార్యాలయాల వద్ద చెత్త తొలగింపు



జిల్లా కార్యాలయాల వద్ద తొలగించిన చెత్త

కొత్తచెరువు, సెప్టెంబరు 27: జిల్లాకేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద ఎదురుగా ప్రభుత్వ కార్యాలయాల చెత్త పేరుకుపోయింది. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం పేరుతో అవగాహన కార్యక్రమాలను కలెక్టర్‌తో పాటు జిల్లా ఉన్నతాధికారులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్దే చెత్త పేరుకపోయి.. అపరిశుభ్రంగా మారాయి. దీనిపై ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు వారి కార్యాలయాలు చుట్టూ ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేయించేలా చర్యలు తీసుకున్నారు.

నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ



సత్తాచాటిన పీసీఆర్ఎంఆర్ పాఠశాల విద్యార్థులు

ధర్మవరం, సెప్టెంబరు 27: స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో గురువారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో తమ విద్యార్థులు సత్తా చాటారని పీసీఆర్ఎంఆర్ పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ శుక్రవారం తెలిపారు. అండర్-14 ఖోఖో బాలికల విభాగంలో విన్నర్స్‌గాను, బాల్‌బ్యాడ్మింటన్ బాలుర విభాగంలో అండర్-14, 17 విన్నర్‌గా, హైజంప్, షార్ట్‌పుట్, డిస్క్, జావలిన్ త్రోలో ప్రతిభ చాటారన్నారు. వీరు అనంతపురంలో త్వరలో జరిగే జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఆ విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో చైర్మన్, డైరెక్టర్లు రూపారాజా జగదీశ్, రాజాకృష్ణ, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేశ్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

మొక్కలు నాటి పరిరక్షిద్దాం

పుట్టపర్తి: మొక్కలు నాటి.. పర్యావరణాన్ని పరిరక్షిద్దామని గ్రీన్ భారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శంకరనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్వీ జానకీ రామయ్య జడ్పీహెచ్ఎస్‌లో ప్రధానోపాధ్యాయులు ప్రభావతమ్మ, విద్యార్థులతో కలసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుల సామకోటి ఆదినారాయణ, చెర్లోపల్లి రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయండి

ముదిగుబ్బ, సెప్టెంబరు 27: ముదిగుబ్బ నుంచి పులివెందులకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డులో దొరిగల్లు వద్ద కల్వర్టుకు రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేయలేదు. పులివెందుల నుంచి బెంగుళూరుకు వెళ్లే ఈ మార్గంలో నిత్యం బస్సులు, లారీలు వెళ్తుంటాయి. రాత్రి సమయంలో వీటి రద్దీ మరి అధికంగా ఉంటోంది. లారీలు, బస్సులు ఎదురుగా వచ్చినప్పుడు ఆటోలు, బొలెరో వాహనాలు కల్వర్టు అంచుల వరకు వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా రక్షణ దిమ్మెలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ వన్నూర్‌స్వామిని వివరణ కోరగా రక్షణ దిమ్మెలు నిర్మించేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు.



రక్షణ దిమ్మెలు లేని కల్వర్టు

ఆదర్శ నియోజకవర్గమే లక్ష్యం

మంత్రి సత్యకుమార్

ధర్మవరం, సెప్టెంబరు 27: . నియోజకవర్గాన్ని ఆదర్శ వంతంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులకు సూచిం చారు. శుక్రవారం ధర్మవరం ఎన్డీఏ క్యాంప్ కార్యాలయంలో నియోజక వర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై అన్నిశాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో సమస్యలు గుర్తించి వేదికలు అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు ఎలా ఖర్చుపెడుతున్నారో.. ఏ రంగాలకు ఎలా అమలు చేస్తున్నారో నివేదిక ఇవ్వాలన్నారు. నియోజకవర్గం అంతటా సురక్షిత నీటిని సరఫరా చేయాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీ పీడీ నరసయ్య, డ్వామా పీడీ విజయేంద్రప్రసాద్, నోడల్ ఆఫీసర్ శివారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి మల్లికార్జునప్ప, ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

సమస్యలు పరిష్కరించండి

బత్తలపల్లి: రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని మంత్రి సత్యకుమార్‌కు తెలుగునాడు వైద్యాశాఖ పారా మెడికల్ యునియన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. వైద్యశాఖలో తీవ్ర గందరగోళానికి కారణమైన జీఓ నెంబర్ 143-32 రద్దు చేయాలని కోరారు. వైద్యఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, సచివాలయంలో పని చేస్తున్న ఏఎన్ఎంలను హెల్త్ డిపార్ట్‌మెంటులో విలీనం చేయాలని కోరారు. ఈ కార్యక్రమములో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, తిరుపాల్‌నాయక్, నరేంద్రరెడ్డి నిర్మలా పాల్గొన్నారు.

రైతులకు సాగు సాయం మంజూరు చేయాలి

ధర్మవరం, సెప్టెంబరు 27 : ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ పెట్టుబడి సాయాన్ని తక్షణమే రైతుల ఖాతాలోకి జమ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రతి రైతుకు రూ.2 లక్షల వరకు అన్నిరకాల బ్యాంకు రుణాలు మాఫీ చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు జిల్లాలుగా ప్రకటించాలన్నారు. మోటార్లకు మీటర్లు పెట్టే జీవోను రద్దు చేయాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. పట్టు రైతులకు రావాల్సిన ఇన్సెంటివ్ వెంటనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మారుతి, సీఐటీయూ మండల కార్యదర్శి జేవీ రమణ, నాయకులు ఎస్‌హెచ్ బాషా, అయూబ్‌ఖాన్, ఎల్ ఆది నారాయణ పాల్గొన్నారు.



ధర్మవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు, రైతుల నిరసన

నల్లచెరువు : రైతుల బ్యాంక్ రుణాలు మాఫీ చేయాలని తహసీల్దార్ రవికుమార్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రాలు అందించారు. ఇందులో నాయకులు సీపీఎం నాయకుడు శ్రీరాములు, రైతు సంఘం కార్యదర్శి వెంకటస్వామి, తిరుమలకొండ, శ్రీరాములు, శివాజీ రైతులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: బ్యాంక్‌ల్లో రైతు రుణాలను మాఫీ చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ జాకీర్ హుస్సేన్‌కు వినతిపత్రం అందచేశారు. ఇందులో రైతు సంఘం నాయకులు రామిరెడ్డి, క్రిష్టప్ప, సీఐటీయూ మండల కన్వీనర్ కుళ్లాయప్ప, కో-కన్వీనర్ శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

బీడు భూములను సాగులోకి తెద్దాం

తనకల్లు, సెప్టెంబరు 27: మండలంలోని తవళం, గేమేనాయక్ తండా, మల్లిరెడ్డిపల్లి, చీకటిమానుపల్లి పంచాయతీల్లో ఎంపిక చేసిన 19 గ్రామాల్లో బీడు భూములను సాగులోకి తేవడానికి రైతులు కృషి చేయాలని జన జాగృతి సంస్థ అధ్యక్షుడు బలరాం సూచించారు. శుక్రవారం మండలంలోని నక్కలరాళ్లతండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీడు భూములను సాగులోకి తీసుకొచ్చే కార్యక్రమం చేపట్టామని, అన్నదాతలు ఈ గ్రామాల్లో బీడు భూములను సాగులోకి తీసుకురావడానికి జనజాగృతి సిబ్బందిని సంప్రందించాలని అన్నారు. జనజాగృతి ఆధ్వర్యంలో ఎంపిక చేసిన రైతులకు ఉచితంగా ఉలవలు ఇవ్వడంతో పాటు, పంట సాగు చేయడానికి అవసరమైన ట్రాక్టర్ ఖర్చులనూ సంస్థే భరిస్తుందని చెప్పారు. సిబ్బంది ఇప్పటికే గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారన్నారు. నక్కరాళ్ల తండా, నడిమికుంటపల్లి గ్రామాల వద్ద ఉలవలు సాగుచేస్తున్నట్లు పేర్కొన్నారు. మిగిలిన గ్రామాల్లో వెంటనే ఉలవలు సాగుచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆర్‌డబ్ల్యూఐ ప్రాజెక్టులో భాగంగా ఈ యేడాది వెయ్యి ఎకరాల్లో ఉలవలు సాగుచేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఆయన వెంట జనజాగృతి ప్రోగ్రాం మేనేజర్ రాంప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



నడిమికుంటపల్లి వద్ద బీడు భూమిని సాగుకు సిద్ధం చేస్తున్న సిబ్బంది

లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములు తిరిగివ్వాలి: సీపీఐ

పుట్టపర్తి, సెప్టెంబరు 27 : లేపాక్షి నాలెడ్జ్ హబ్ భూములు తిరిగి రైతులకు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సాయి ఆరామంలో వారు మాట్లాడుతూ.. రెండు దశాబ్దాల క్రితం నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి లేపాక్షి నాలెడ్జ్ హబ్ పేరిట 8844 ఎకరాలు భూమిని రైతుల నుంచి కొనుగోలు చేశారన్నారు. పరిశ్రమలు స్థాపించి 20 లక్షల మందికి ఉద్యోగాలు చూపిస్తామన్నారు. అయితే ఇంతవరకూ పరిశ్రమలు స్థాపించలేదన్నారు. ఎంతోమంది భూములు కోల్పోయిన రైతులు ఉపాధి లేక వలస వెళ్లారని, ఆ భూములను తిరిగి ఆ రైతులకే ఇవ్వాలని వారు డిమాండు చేశారు. మరమగ్గాలను అడ్డుకొని చేనేతలను ఆదుకోవాలని, హంద్రీనీవా కాలువల ఆధునికీకరించి రైతులకు సాగు నీరందించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో నాయకులు కాటమయ్య, అంజనేయులు, మహదేవ, కమతం కాటమయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జగదీష్



నాయకులకు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

గౌనిపల్లి వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 27 : గౌనిపల్లి బీసీ బాలుర వసతి గృహంలో తమకు సక్రమంగా మెనూ అమలు చేయడం లేదని, హాజరు శాతంలో వార్డెన్ అవకతవకలకు పాల్పడుతున్నారని విద్యార్థులు వాపోతున్నారు. శుక్రవారం ఆ హాస్టల్‌ను ప్రగతి శీల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నాగేంద్ర తనిఖీ చేశాడు. ఆయన దృష్టికి విద్యార్థులు పలు సమస్యలను తీసుకొచ్చారు. గదుల్లో కనీసం ఫ్యాన్ సౌకర్యం కూడా లేదని వాపోయారు. వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలని వారు వినతి పత్రం అందజేశారు. ఆ వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేస్తామని మంజుల నాగేంద్ర తెలిపారు. ఆయన వెంట విద్యార్థి సంఘం నాయకులు ఉన్నారు.

ఆరడుగులూ కరువాయె..!

- శ్మశాన వాటికలు లేక ఎస్సీ, ఎస్టీల పాట్లు
- ఓడీసీ మండలంలో దుస్థితి

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 27: మండలంలోని నవాబుకోట, తిప్పేపల్లి, మామిళ్లకుంట్లపల్లి, సున్నంపల్లి, అల్లాపల్లి, మలకవారిపల్లి, ఇలా చాల గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు శ్మశాన వాటికలు లేవు. దీంతో రోడ్డు పక్కన .. లేదా వారి పొలాల్లో మృతదేహాలను పూడ్చికోవాల్సిన దుస్థితి ఉంది. ఓబుళదేవరచెరువు, మరికొన్ని గ్రామాల్లో శ్మశాన వాటికలు ఉన్నా... తగినంత స్థలం లేకపోవడం.. వాటికి ప్రహరి .. కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తుమ్మలకుంట్లపల్లిలో ముస్లిం శ్మశాన వాటికకు ప్రహరీ లేకపోవడంతో పూడ్చిన మృతదేహాలను జంతువులు వెలికి తీస్తున్నాయి. ఇనగలూరు దళిత శ్మశానవాటికకు ప్రహరీగోడ లేదు. మండలకేంద్రంలో చెరువు ప్రాంతంలో శ్మశానవాటిక ఉన్నా.. తగినంత స్థలం లేకపోవడంతో గతంలో పూడ్చిన స్థలంలోనే మరో మృతదేహాన్ని పూడ్చాల్సిన దుస్థితి ఉంది. శ్మశాన వాటిక కోసం స్థలాలు కేటాయించాలని గత వైసీపీ పాలనలో దళితులు పలుమార్లు పాలకులు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వమైన శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని ఎస్సీ ఎస్టీలు కోరుతున్నారు.



తుమ్మలకుంట్లపల్లిలో ప్రహరీలేని ముస్లిం శ్మశాన వాటిక

పలుమార్లు విన్నవించాం



మా గ్రామంలో శ్మశాన వాటికకు ప్రహరి నిర్మించాలని చాలాసార్లు కోరాం. అయినా ఎవరూ పట్టించుకోలేదు. శ్మశాన వాటికకు ప్రహరి లేకపో వడంతో జంతువులు వస్తున్నాయి. శ్మశానికి పక్కనే ఈద్గా మైదానం ఉంది. ప్రహరిని నిర్మిస్తే అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

- ఎస్ ఇర్ఫాన్, తుమ్మలకుంట్లపల్లి

దళితులకు ఇబ్బంది



మండల వ్యాప్తంగా చాలా గ్రామాల్లో దళితులకు శ్మశాన వాటికలు లేవు. గత ప్రభుత్వం స్థలం కేటాయించాలని కోరినా పట్టించుకోలేదు. ఓడీసీ, ఇతర గ్రామాల్లో దళితుల శ్మశాన వాటికలకు కూటమి ప్రభుత్వం స్థలాలు కేటాయించాలి.

-శ్రీనివాసులు, ఎమ్మార్పీఎస్ నాయకుడు, ఓడీసీ

బాధ్యతల స్వీకరణ..



పెనుకొండ డీఎస్పీగా వెంకటేశ్వర్లు

పుట్టపర్తి రూరల్, సెప్టెంబరు 27 : పెనుకొండ డీఎస్పీగా వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ చాంబర్‌లో ఎస్పీ రత్నను మర్యాద పూర్వకంగా కలిశారు. గతంలో ఈయన ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేసేవారు.

బత్తలపల్లి తహసీల్దార్‌గా స్వర్ణలత



బత్తలపల్లి, సెప్టెంబరు 27 : స్థానిక తహసీల్దార్‌గా స్వర్ణలత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న శివశంకర్ నాయక్ కర్నూలుకు బదిలీ కావడంతో.. ఆయన స్థానంలో పలమనేరులో పనిచేస్తున్న స్వర్ణలతను బదిలీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చేవారు నేరుగా తననే కలిసి సమస్యలు పరిష్కరించుకోవాలని, ఎవరైనా దళారులు లంచం అడిగితే తన దృష్టికి తీసుకొని రావాలని సూచించారు.

నంబులపూలకుంట డీటీగా దేవేంద్రనాయక్

నంబులపూలకుంట, సెప్టెంబరు 27: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా దేవేంద్రనాయక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి రవినాయక్ మూడు నెలల క్రితం తలుపుల మండలానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నల్లమాడ డిప్యూటీ తహసీల్దార్ దేవేంద్రనాయక్‌ను ఇక్కడికి బదిలీ చేశారు.



కొత్తచెరువు డీటీగా రామాంజనేయులు



కొత్తచెరువు, సెప్టెంబరు 27 : డిప్యూటీ తహసీల్దార్‌గా బాల రామాంజనేయులు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడి డిప్యూటీ తహసీల్దార్ స్వాతి పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ కాగా, ఆమె స్థానంలో మడకశిర డిప్యూటీ తహసీల్దార్ బాల రామాంజినేయులును ఇక్కడి నియమించారు.

కదిరి ఎంపీడీఓగా పోలప్ప



కదిరి అర్బన్, సెప్టెంబరు 27: మండల ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓగా పోలప్ప శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

గాండ్లపెంట ఎంపీడీఓగా వెంకటరామిరెడ్డి



గాండ్లపెంట, సెప్టెంబరు 27: మండల ఎంపీడీఓగా వెంకటరామిరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. తలుపుల ఎంపీడీఓ రామనాయక్ ఇక్కడ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించేవారు.

కదిరి సబ్ రిజిస్ట్రార్‌గా శ్రీనివాసులు



కదిరి, సెప్టెంబరు 27: పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్‌గా ఈ. శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాయదుర్గం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

బుక్కపట్నం ఎస్ఐగా క్రిష్ణమూర్తి



బుక్కపట్నం, సెప్టెంబరు 27: మండల ఎస్ఐగా క్రిష్ణమూర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను పుట్టపర్తి రూరల్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న సురేష్‌బాబు బదిలీపై నంద్యాల జిల్లాకు వెళ్లారు.

క్లుప్తంగా ...

ధర్మవరం రూరల్ ఎస్ఐగా శ్రీనివాసులు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 27: బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులును ధర్మవరం రూరల్ ఎస్ఐగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడి ఎస్ఐ నరేంద్రను రొద్దంకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పోతుకుంట వద్ద ఉన్న పోలీస్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం రాత్రి నరేంద్రను సిబ్బంది డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

డీఎఫ్ఓకు సన్మానం

పుట్టపర్తి టౌన్, సెప్టెంబరు 27: శ్రీసత్యసాయి జిల్లా అటవీశాఖాధికారి చక్రపాణి బదిలీపై ఇక్కడికి రాగా.. ఇక్కడి డీఎఫ్ఓ రవీంద్రనాథ్‌రెడ్డి విధుల నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో శుక్రవారం జిల్లా అటవీశాఖ కార్యాలయంలో ఆయన్ను నూతన డీఎఫ్ఓ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి.. వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సబ్ డీఎఫ్ఓ ఆనంద్, జిల్లాలోని స్పెషల్, రెయింజ్ అధికారులు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బత్తలపల్లి, సెప్టెంబరు 27 : మండలంలోని మాల్యవంతం గ్రామానికి చెందిన టీడీపీ మండల కన్వీనర్ గోనుగుంట్ల నారాయణరెడ్డి తమ్ముడు రాజు అనారోగ్యంతో గురువారం మరణించిన విషయం తెల్సిందే. ధర్మవరం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ శుక్రవారం ఆ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట గోనుగుంట్ల విజయ కుమార్, చింతలపల్లి మహేష్, ఫణికుమార్, సతీష్, సురేంద్ర, కిష్టయ్య, మనోజ్ ఉన్నారు.

ఓబుళదేవరచెరువు: మండలంలోని మల్లాపల్లికి చెందిన తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు బూదిలి ఓబులరెడ్డి తల్లి పద్మావతి అనారోగ్యంతో అనంతపురంలోని ఏ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమెను మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు ఓబులరెడ్డి, గిరినాథ్‌రెడ్డి ఉన్నారు.

అమ్మవారికి ఆభరణాల సమర్పణ

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 27: స్థానిక చిత్రావతి నది ఒడ్డున వెలసిన ఏటిఒడ్డు గంగమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన చెరుకూరి తిరుపాలమ్మ, నారాయణప్ప దంపతులు రూ. లక్ష విలువచేసే పంచలోహ ఆభరణాలు అందజేసినట్లు ఆలయ అర్చకుడు పుట్లగంగాద్రి శుక్రవారం తెలిపారు. ప్రభావం, పంచలోహ కిరీటం, రాళ్ల కిరీటం, మంగళసూత్రం, కంఠహారాలు, అభిషేకానికి కావాల్సిన రాగి బిందె తదితర వస్తువులను అందజేసినట్లు తెలిపారు.

వ్యాసరచన పోటీలు

నల్లమాడ, సెప్టెంబరు 27: మండలంలోని దొన్నికోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో స్వచ్ఛతాహీ సేవా స్వర్ణాంధ్రప్రదేశ్‌పై విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. విజేత విద్యార్థులకు అక్టోబరు రెండున గాంధీ జయంతి రోజున బహుమతులు అందజేస్తామని ప్రధానోపాధ్యాయులు గీతా, సర్పంచ్ సరస్వతి తెలిపారు.

పాఠశాలల తనిఖీ

బత్తలపల్లి, సెప్టెంబరు 27: స్థానిక జక్కంపూటి వెంకటేశులు బాలుర ఉన్నత పాఠశాల, బాలికల పాఠశాలను జడ్పీ సీఈఓ ఓబులమ్మ శుక్రవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. సమస్యలపై విద్యార్థులతో ఆరా తీశారు. పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ ఛైర్మన్లు పాల్గొన్నారు.

జింక పిల్ల అప్పగింత



ధర్మవరం రూరల్, సెప్టెంబరు 27 : మండలంలోని ఆర్.యర్రగుంటపల్లి గ్రామంలో రైతు విజయ్‌నరసింహారెడ్డి దానిమ్మతోటలోకి శుక్రవారం ఓ జింకపిల్ల వచ్చింది. రైతు ఆ జింకపిల్లను పట్టుకుని అటవీశాఖ అటవీశాఖ ఫారెస్టు బీట్ ఆఫీసర్ అక్కులప్పకు అప్పగించారు. ఆ జింకపిల్లను పుట్టపర్తిలోని కరుణ సొసైటీ జంతువుల శాలకు అప్పగించినట్లు అక్కులప్ప తెలిపారు.

సీటీఓ బాధ్యతల స్వీకరణ


సీటీఓ కృష్ణవేణి

హిందూపురం, సెప్టెంబరు 27 : హిందూపురం వాణిజ్యపన్నుల శాఖ అధికారిగా (సీటీఓ)గా కృష్ణవేణి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న గోపీనాథ్‌ను గుంతకల్లుకు బదిలీ చేయగా అక్కడ పనిచేస్తున్న కృష్ణవేణిని హిందూపురానికి బదిలీ చేశారు. ఈ మె ప్రొద్దుటూరు, గుంతకల్లు సీటీఓగా పనిచేసి హిం దూపురం వచ్చారు. హిందూపురం వ్యాపార సంఘాల ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు సీటీఓ ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీటీఓ మాట్లాడుతూ వ్యాపారులు ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి పన్నులు చెల్లించి సహకరించాలన్నారు. జీరో వ్యాపారం చేసినా ఇక్కడ జీ ఎస్‌టీ ఎగ్గొట్టినా సహించేది లేదన్నారు.

తహసీల్దార్‌గా మారుతి..


తహసీల్దార్ మారుతి

గోరంట్ల, సెప్టెంబరు 27: మండల నూతన తహసీల్దార్‌గా మారుతీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ అక్బల్ బాషా ఇటీవల కడపకు బదిలీపై వెళ్లారు. అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న మారుతిని గోరంట్ల తహసీల్దార్‌గా నియమించడంతో బాధ్యతలు చేపట్టారు.

సర్వేయర్‌గా మణికిషోర్..

గుడిబండ, సెప్టెంబరు 27 : మండల ల్యాండ్ భూసర్వే అధికారిగా మణికిషోర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో మండల సర్వేయర్‌గా పనిచేస్తున్న పుట్టరాజు గుత్తి మండలానికి బదిలీ అయ్యారు. అప్పటి నుంచి మండలంలో ల్యాండ్ సర్వే అధికారి పోస్టు ఖాళీగా ఉండేది. ఆ స్థానంలో మడకశిర నుంచి గుడిబండ మండలానికి మణికిషోర్‌ను ఉన్నతాధికారులు నియమించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

'కరియప్ప సేవలు మరువలేనివి'

మడకశిర టౌన్, సెప్టెంబరు 27: పట్టణంలోని ఓంశాంతి అధ్యక్షుడు రిటైర్డ్ డిప్యూటీ తహసీల్దార్ కరియప్ప అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకొన్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, మున్సిపల్ వైస్‌చైర్మన్ వెంకటలక్ష్మమ్మ, నాయకులు నాగరాజు, ఉమాశంకర్ కరియన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తిప్పేస్వామి మాట్లాడుతూ డిప్యూటీ తహసీల్దార్‌గా మడకశిర నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో రైతులకు ఎన్నో సేవలు అందించారన్నారు. అదేవిధంగా ఓంశాంతి అధ్యక్షుడిగా ఆధ్యాత్మికత పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఆయన ముందుండేవారని కొనియాడారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు.

చిరుతల దాడులతో పాడిరైతుల బెంబేలు

గుడిబండ, సెప్టెంబరు 27 : గుడిబండ కొండలో చిరుతలు సంచరిస్తుండడంతో పాడిరైతులు ఆందోళన చెందుతున్నారు. పాడి ఆవులు, గొర్రెలు, మేకలపై రాత్రి వేళల్లో ఇంటి పరిసర ప్రాంతాల్లో దాడులు చేస్తుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. గురువారం భోజరాజు అనే వ్యక్తి ఆవుదూడలపై దాడిచేయబోయింది. దీంతో చుట్టుపక్కల వారు గమనించి కేకలు వేయడంతో చిరుత కొండలోకి పారిపోయిందని గ్రామస్థులు తెలిపారు. ఫారెస్ట్ అధికారులు స్పందించి చిరుతలను బంధించి ఇతర ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రమశిక్షణతో అభ్యసించాలి

లేపాక్షి, సెప్టెంబరు 27 : విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని టీడీపీ మండల కన్వీనర్ జయప్ప అన్నారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు సకాలంలో అందిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మహబూబ్‌బాషా, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మిద్దెపైనుంచి పడి వ్యక్తి మృతి

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 27 : మండలంలోని కోనాపురంలో మిద్దెపై నుంచి పడి బంగారు సోమశేఖర్‌రెడ్డి(48) అనే వ్యక్తి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. సోమశేఖర్‌రెడ్డి ఇంట్లో టీవీ రాలేదని మిద్దెపై ఎక్కి డిష్ సరిచేస్తూ కాలుజారి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్సల అనంతరం అనంతపురం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

రొళ్ల, సెప్టెంబరు 27 : మండలానికి చెందిన టీడీపీ కార్యకర్త నరసింహమూర్తి ద్విచక్ర వాహనంలో కిందపడడంతో గాయాలయ్యాయి. హిందూపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు స్పందించి మండల నాయకుల ద్వారా రూ.20 వేలు ఆర్థిక అందించారు. కార్యక్రమంలో నాయకులు దాసిరెడ్డి, ఈరన్న, మూర్తి, రమేష్ పాల్గొన్నారు.

విద్యాసామగ్రి అందజేత

పావగడ, సెప్టెంబరు 27 : మండలంలోని మల్లమనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు భారతమాత సేవాట్రస్ట్ అధ్యక్షుడు నాగేంద్ర విద్యాసామాగ్రిని అందజేశారు. శిలను శిల్పంగా మార్చే శక్తి శిల్పికి ఉన్నట్లే ఎంతటి బండ విద్యార్థినైనా ప్రయోజకుడిగా చేసే శక్తి గురువేకు మాత్రమే సాధ్యమని ఆయన తెలిపారు. ట్రస్ట్ సభ్యులు దినేష్ రాణా, ప్రతాప్, ఉపాధ్యాయులు దర్శల్, విజయలక్ష్మీ, దేవి, రమ్య ఉన్నారు.

కార్యవర్గం ఎన్నిక

అగళి, సెప్టెంబరు 27 : మండల కేంద్రంలోని త్రివేణి మండల సమాఖ్య నూతన పాలకవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఏరియా కోఆర్డినేటర్ నాగరాజ్, ఏపీఎం సురేష్ తెలిపారు. అధ్యక్షురాలిగా మంజుల, కార్యదర్శిగా అమ్మాజీ, కోశాధికారి మంజుల, ఉపాధ్యక్షురాలిగా రంగమ్మ, ఉప కార్యదర్శి రాధమ్మ, ఓబీసీ మెంబర్లు అందరి సమక్షంలో ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. త్రివేణి సమైఖ్య 19వ వార్షికోత్సవ సమావేశం నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల, సెప్టెంబరు 27 : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ముఖ్య అతిథిగా మడకశిర శాసనసభ్యులు ఎం.ఎస్.రాజు హాజరవుతున్నారు. మండల స్థాయి అధికారులు ఆయా శాఖల నివేదికలతో హాజరుకావాలన్నారు.

సంపాదించుకుని.. వదిలేశారు..!

తాగునీటి ప్లాంట్లకు మరమ్మతులు.. వైసీపీ నాయకుల నిర్వాకంతో గ్రామీణులకు అవస్థలు

మడకశిర రూరల్, సెప్టెంబరు 27 : పలు గ్రామాల్లో ఉన్న తాగునీటి ప్లాంట్లు పనిచేసేవరకు సంపాదించుకుని మరమ్మతులు రాగానే వైసీపీ నాయకులు వదిలేశారని ఆయా గ్రామాల ప్రజలు మండిపడుతున్నారు. మడకశిర మండలంలోని ఆమిదాలగొంది, చందకచర్ల, ఆర్.అనంతపురం, మెళవాయి, నీలకంఠాపురం, హరేసముద్రం, కల్లుమర్రి, వైబీహళ్లి పంచాయతీ కేంద్రాల్లో తాగునీటి ప్లాంట్లు ఉన్నాయి. గతంలో టీడీపీ ప్రభుత్వం ఎన్‌టీఆర్ సుజల స్రవంతి పథకం కింద ఈ తాగునీటి ప్లాంట్లను ఏర్పాటు చేసింది. బిందె రూ.2 కే స్వచ్ఛమైన మంచి నీటిని అందించింది. వైసీపీ ప్రభుత్వం రాగానే వాటి నిర్వహణ ఆ పార్టీ నాయకులు చేపట్టారు. బిందె నీరు రూ.5లకు పెంచారు. విధిలేని పరిస్థితుల్లో ప్రజలు కొనుగోలు చేశారు. రెండేళ్లు బాగా సంపాదించుకున్నారు. తర్వాత తాగునీటి ప్లాంట్లు మరమ్మతులకు రావడం, అధికంగా విద్యుత్ బిల్లులు రావడంతో వాటిని చెల్లించలేక, ప్లాంట్లను మరమ్మతులు చేయించకుండా నాయకులు వదిలివేశారని గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం తాగునీటి ప్లాంట్లు పనిచేయకుండా గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్నాయి. ప్రైవేట్ వాహనాలు ద్వారా గ్రామాలకు వచ్చే మంచి నీటిని బిందె రూ.10, క్యాన్ రూ.15 పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికైౖ సంబంధిత అధికారులు స్పందించి గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న ప్లాంట్లకు మరమ్మతులు చేయించి మంచినీటిని అందించాని ప్రజలు కోరుతున్నారు.


ఆమిదాలగొందిలో నిరుపయోగంగా ఉన్న తాగునీటి ప్లాంటు

రైతు రుణాలను మాఫీ చేయండి



హిందూపురం అర్బన్, సెప్టెంబరు 27: పంటల కోసం రైతులు బ్యాంకుల్లో తీసుకొన్న రుణాలను మాఫీ చేయాలని రైతు సంఘం నాయకుడు సిద్దారెడ్డి, జలసాధన కమిటీ సభ్యుడు గంగిరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వారు డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా రైతులు తీవ్ర ఒడుదుడుకులను ఎదుర్కొంటున్నారన్నారు. ఒక పక్క వర్షాభావ పరిస్థితులు, మరో పక్క కరువు విపత్తులు తాండవిస్తున్నాయన్నారు. సున్నా వడ్డీ, పావలా వడ్డీ అందడం లేదన్నారు. రైతులకు బ్యాంకర్లు రూ. 2 లక్షల వరకు అప్పులు మాఫీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు అందించాలని, తుపాను, విపత్తుల కారణంగా నష్టపోయిన పంటలకు ఉచిత బీమా అమలు చేయాలని, జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని, వ్యవసాయ మీటర్లు రద్దు చేయాలని, సాగుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పట్టు రైతులకు ఇన్‌సెంటివ్ ఇవ్వాలని, గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీరు అందించి అన్ని చెరువులు నింపాలని డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఆదినారాయణరెడ్డి, నరసింహారెడ్డి, విజయ్‌కుమార్, పట్టుగూళ్ల సంఘం నాయకుడు జయరామిరెడ్డి, జిల్లా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, నాయకులు రాము, రామకృష్ణ, ఉమర్ పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

సోమందేపల్లి : రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కమిటీ నాయకులు శుక్రవారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందించాలన్నారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో తుపాన్లతో పంట నష్టపోయిన రైతులకు బీమా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, వ్యవసాయ మోటార్లకు మీటర్లను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రంగప్ప, రాజగోపాల్, చాంద్‌బాషా, షిలా నారాయణస్వామి, శ్రీకాంత్, గంగరాజు, కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ

గోరంట్ల, సెప్టెంబరు 27: పట్టణంలోని మోదీన్ బిల్డింగ్స్‌లో నిర్వహిస్తున్న రెండు దుకాణాల్లో గురువారం రాత్రి దొంగలు కన్నంవేసి చోరీకి పాల్పడ్డారు. దుకాణాల పైకప్పులో సిమెంట్ షీట్లు ఏర్పాటు చేయడంతో పగలకొట్టి విలువైనవస్తువులు, నగదు చోరీ చేశారు. అబ్బల్ హోమ్‌నీడ్స్ దుకాణంలో రూ.5వేల నగదు, రూ.60వేలు విలువ చేసే సామగ్రి ఎత్తుకెళ్లినట్లు యజమాని అబ్బల్ తెలిపారు. అలాగే మల్లాపల్లి షాకీర్‌కు చెందిన మెన్స్‌వేర్ దుస్తుల దుకాణంలో పైకప్పు పగలకొట్టి 25 జతల రెడిమేడ్ దుస్తులు, రూ.50వేల నగదు, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ శేఖర్ చోరీ జరిగిన సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా పోలీసులను రంగంలోకి దింపడంతో కదిరి ప్రాంతంలో నిందితుని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.



వస్త్ర దుకాణంలో పైకప్పునకు కన్నం, చోరీ జరిగిన ఎలక్ట్రికల్ దుకాణం

వారసత్వ సంపద భావితరాలకు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ, సెప్టెంబరు 27 : వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్రశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రాచీన కట్టడాలు, వాటి పరిసరాలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పెనుకొండ పట్టణం చారిత్రాత్మక ప్రదేశమని, విజయనగర సామ్రాజ్య రెండో రాజధానిగా వెలుగొందిందని అన్నారు. గత వైభవానికి చిహ్నంగా అనేక కట్టడాలు, కోటగోడలు, దేవాలయాలు నిలిచాయని తెలిపారు. ప్రభుత్వం గతంలో లేపాక్షి, పుట్టపర్తి, కదిరి, టూరిస్ట్ సర్క్యూట్‌గా ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప పాల్గొన్నారు.

విజయవాడకు కిట్ల తరలింపు


సరుకుల లారీ వద్ద పెనుకొండ బీజేపీ నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 27: వరద బాధితుల సహాయార్థం బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు గత పదిరోజులుగా పెనుకొండ మండలంలో సేకరించిన నిత్యావసర సరుకులు, దుస్తులను కిట్లుగా తయారు చేసి విజయవాడకు తరలించినట్లు సభ్యత్వ నమోదు ప్రముఖ్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. అక్కడ పార్టీ కార్యాలయం నుంచి బాధితులకు అందజేస్తామని వివరించారు.

వైద్యులు లేక రోగుల అవస్థలు

పావగడ, సెప్టెంబరు 27 : ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో 14మంది వైద్యులు ఉండాల్సి ఉండగా ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తుండటంతో రోగుల ఇబ్బంది పడుతున్నారు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో వైద్యుల కొరత తీవ్రంగా ఉన్నట్లు ఇక్కడ కనిపిస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. మహిళల వైద్యుడు బాబు, చిన్న పిల్లల వైద్యుడు కిరణ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పని ఒత్తిడి అధికంగా ఉండటంతో ప్రత్యేక వైద్యులను నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈఎన్‌టీ, అనస్తీషియా, ముగ్గురు మెడికల్ అధికారులు, ఇద్దరు ఓపీడీ వైద్యులు ఇక్కడ బాధ్యతలు నిర్వహించాల్సి ఉండగా ఓ మహిళా వైద్యురాలు, ఇన్‌చార్జ్ వైద్యుడు మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు. రోజుకు 400 నుంచి 500దాకా ఓపీ చీటీలతో రోగులు ఆసుపత్రికి వస్తున్నారని సరైన చికిత్స అందకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోందని రోగులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వైద్యులను నియమించాలని తాలూకా ప్రజలు కోరుతున్నారు.


వైద్యుల కోసం ఎదురుచూస్తున్న రోగులు

మీ విజన్ - మా మిషన్‌పై అవగాహన

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 27: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్వర్ణాంధ్ర-2047 మీ విజన్-మా మిషన్'పై స్థానిక ఎన్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహనా కార్యక్రమం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి విజన్‌పై విద్యార్థులకు సమగ్రంగా వివరించారు. పరిశ్రమలు ఆధారిత, నైపుణ్య పెంపుదలపై విద్యార్థులను గ్రూపులుగా విభజించి చర్చాగోష్ఠి నిర్వహించారు. అనంతరం పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించకొని విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లాలో ఎన్నో చారిత్రాత్మక కట్టడాలు, వారసత్వ సంపద కలిగి ఉండి వెలుగులోకి రాని ప్రదేశాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకుడు శ్రీధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రంగనాయకులు, వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రగతి

అగళి : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం స్వర్ణాంధ్ర-2047పై ఎంపీడీఓ రవిప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. మండలంలోని జడ్పీటీసీ, సర్పంచులు, మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవిప్రసాద్ మాట్లాడుతూ 2047సంవత్సరంలో వంద సంవత్సరాల స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించుకుంటుందన్నారు. భారతదేశం సమగ్ర అభివృద్ధి సాధించాలని లక్ష్యంతో వికసిత్ భారత్ విజన్ 2047కింద ప్రపంచ మూడు అగ్రగామి ఆర్థిక శక్తుల్లో ఒకటిగా ఎదగాలనే నినాదంతో ముందుకు వెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఉమేష్, సర్పంచులు ఉపాధిహామీ ఏపీఓ శివన్న, పరిపాలన అధికారి శ్రీనివాసరావు, తదితరశాఖ అధికారులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఆర్డీఓ, డీఎస్పీ


మంత్రిని కలిసిన ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకట్వేర్లు

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 27 : నూతనంగా బాధ్యతలు చేపట్టిన పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆమె స్వగృహానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పారదర్శకమైన పాలన అందించాలని, రైతు సమస్యలు ఏవైనా ఉంటే త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓకు సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చూసుకోవాలని డీఎస్పీకి సూచించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రత్నను మర్యాదపూర్వకంగా కలిశారు.

జాతీయ విద్యా విధానం వద్దు : ఏఐఎస్ఏ


రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎస్ఏ నాయకులు

మడకశిరటౌన్, సెప్టెంబరు 27 : జాతీయ విద్యా విధానం వద్దని, రాష్ట్ర విద్యా విధానం కావాలంటూ ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఐసా జిల్లా అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ నిర్బంధంగా రాష్ట్రాలపై నూతన జాతీయ విద్యా విధానాన్ని రుద్దుతున్నారని, దీనిని విద్యార్థులు పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఇది ప్రభుత్వ విద్యకు తీరని లోటు అన్నారు. రాష్ట్రంలో కళాశాలలు, విశ్వ విద్యాలయాలను కాపాడాలని డిమాండ్ చేశారు. అమరాపురం బస్టాండు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పరుశురాముడు, పునిత్, రమేష్, అనిల్, కార్తీక్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

పరిమళించిన మానవత్వం

అనాథ వృద్ధురాలికి అంత్యక్రియలు


వృద్ధురాలికి అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 27 : సోమందేపల్లి గ్రామానికి చెందిన నూర్జహాన్ అనే వృద్ధురాలు అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. సమాచారం అందుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ సోమందేపల్లి జామియామసీదు ముతవల్లి మహ్మద్ ద్వారా స్థానిక ఆవాజ్ నాయకుడు మహబూకు సమాచారం ఇచ్చారు. స్పందించిన ఆయన మృతదేహాన్ని సోమందేపల్లికి తీసుకొచ్చి స్థానికుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. జబ్బార్‌బాషా, నూర్జహాన్ కొన్నేళ్లుగా సోమందేపల్లిలో నివాసముంటూ చిన్నపాటి వ్యాపారంతో జీవిస్తున్నారు. వీరికి ఎవరూ లేకపోవడంతో స్థానిక ముస్లింల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ సభ్యులు, జామియా మసీదు జమాత్ సభ్యులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

హిందూపురం, సెప్టెంబరు 27 : మండలంలోని చలివెందులకు చెందిన పురుషోత్తం అలియాస్ బాబు(21)అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ అంజనేయులు తెలిపారు. కొంతకాలం క్రితం పురుషోత్తం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అప్పటి నుంచి కడుపునొప్పితో తీవ్రంగా బాధపడుతున్నాడు. పలుచోట్ల చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది శుక్రవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తలుపులు పగలకొట్టి చూసేసరికి ఉరికి వేలాడుతున్నాడు. కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని శవపంచనామా నిమిత్తం హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి శ్రీరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 27: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ గంగప్పను కలిసి వినతిపత్రం అదించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పాఠశాలలు ప్రారంభమై ఇప్పటికే మూడు నెలలు కావస్తున్నా నేటికీ పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పూర్తిగా అందలేన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి, నాయకులు దేవరాజ్, పవన్, గోపి, జాయిద్, నూర్, గిరి, ఆరిఫ్, అశ్వక్, వహీద్ పాల్గొన్నారు.

అనుమనపల్లిలో వైద్య చికిత్సలు

అగళి, సెప్టెంబరు 27: మండలంలోని అనుమనపల్లిలో ఇంటింటా వైద్య చికిత్సలు అందించినట్లు డాక్టర్ శివానంద తెలిపారు. శుక్రవారం ఇంటింటికి వెళ్లి చికిత్సలు నిర్వహించారు. గ్రామాల్లో రోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా ఈ చికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మలేరియా డెంగీ, విషజ్వరాలు తదితర వాటిని అరికట్టేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో కూడ వైద్య చికిత్సలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ప్రజలు ఇంటి చుట్టుపక్కల మురుగునీరు, దోమలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది గంగిరెడ్డి, సుబ్బయ్య సుదాకర్, రాజు, ఆశా కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధిస్తాం

గోరంట్ల, సెప్టెంబరు 27: గోరంట్ల బాలికల ఉన్నతపాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నట్లు ఎంఈఓ జాన్ రెడ్డెప్ప తెలిపారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాల మేరకు ఉత్తమ ఫలితాల సాధనకు బాలికల ఉన్నతపాఠశాలను దత్త తీసుకున్నామన్నారు. 10వతరగతి బాలికలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పరీక్షలకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఎంఈఓ మండలంలోని మల్లెల, కొండాపురం, ముద్దలకుంటపల్లి, రాగిమేకలపల్లి, పాఠశాలలను తనిఖీ చేశారు.

భవనాలను పరిశీలించిన టీడీపీ నాయకులు

పెనుకొండ, సెప్టెంబరు 27 : పట్టణంలోని సెంట్రల్ స్కూల్ నందు నాడు నేడు కింద అర్ధాంతరంగా ఆగిన పాఠశాల భవనాలను టీడీపీ నాయకులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆగిపోయిన పనులను వెంటనే ప్రారంభించాలని పిల్లలకు తాగునీటి కోసం ఆర్ఓప్లాంట్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు, విద్యాకమిటీ చైర్‌పర్సన్ శ్రీదేవి, వైస్ చైర్మన్ బాబా ఫక్రుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.